
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గురు రాఘవేంద్ర నమో నమః

- రజత గజవాహనంపై ప్రహ్లాదరాయలు
- శాకోత్సవం చేసిన పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు
- మూలరాములకు కనకాభిషేకం
- రాఘవరాయల బృందావనానికి విశేష అలంకరణ
- టీటీడీ నుంచి పట్టువస్త్రాల సమర్పణ
- ఉత్సవమూర్తికి తెప్పోత్సవం

మంత్రాలయం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గురు రాఘవేంద్ర నమో నమః అంటూ వేలాది మంది భక్తులు రాఘవేంద్రస్వామి సన్నిధిలో తరించారు. రాఘవేంద్రస్వామి 354వ సప్త రాత్రోత్సవాల్లో రెండో రోజు శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. మూలరాములకు చేసిన కనకాభిషేకం భక్తులను కనువిందు చేసింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉత్సవమూర్తిని ఊంజల సేవలో ఊగిస్తూ పీఠాధిపతి శాకోత్సవం చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మఠం ప్రాంగణం మార్మోగింది. బృందావనంను బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, గులాబి ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పీఠాధిపతి మహా మంగళ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, రవి కులకర్ణి, సీఆర్‌వోలు విజయేంద్రాచార్, జయతీర్థాచార్, ఏఈ బద్రీనాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, డీఎం ఆనందరావు, డీఎస్పీలు బాబు ప్రసాద్, ఎంఎస్ భార్గవి, వెంకట్రామయ్య, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.





టీటీడీ పట్టువస్త్రాలను తలపై మోసుకు వస్తున్న పీఠాధిపతి

ఊరేగింపుగా..

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ఉత్సవాల్లో భాగంగా టీటీడీ నుంచి అధికారికంగా జేఈవో (ఫేస్కర్) రామకృష్ణ తెచ్చిన పట్టువస్త్రాలు, ప్రసాదాన్ని ముఖ ద్వారం నుంచి ఏఏవో మాధవశెట్టి, మఠం మేనే జర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, సురేష్ కోనా పూర్, ఏఏవో మాధవశెట్టి, స్వాగతం పలికి ఊరేగింపుగా తీసుకువచ్చారు.

మిగతా 6వ పేజీలో



పుష్కరిణిలో ప్రహ్లాదరాయల తెప్పోత్సవం

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఏదశలో ఉందో తెలుసుకోవడం కోసం కాల్‌సెంటర్ నెంబర్ 1100కు ఫోన్‌చేసి తెలుసుకో వచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

నిండిన లింగాలవాగు డ్యాం

- 280 ఎకరాలకు అందనున్న సాగునీరు



లింగాల వాగు డ్యాం నిండి ప్రవహిస్తున్న నీరు


మద్దికెర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామం లింగాల వాగు డ్యాం నీటితో నిండింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కురవడంతో నీరు చేరింది. డ్యాం పరిధిలో బసినేపల్లి, రాంపురం, రాంపురం కొట్టాల, మదనంతపురం గ్రామాలకు చెందిన 280 ఎకరాల ఆయకట్టు ఉంది. డ్యాం నిండటంతో ఈ ఏడాది పంటలకు నీటి కొరత ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే బసినేపల్లి, మదనంతపురం గ్రామాల్లో కూడా వర్షాలు కురిశాయి.

ప్రతిభావంతుల కోసమే..

- ఔత్సాహిక క్రీడాకారులకు సువర్ణ అవకాశం
- 16నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు

7

రాంజల కలుషితం



రాంజల చెరువు

ఆదోని టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణ వాసులకు వేసవికాలంలో తాగునీటిని అందించే రాంజల చెరువు కలుషితమైంది. చెరువులో కొందరు చేపలను పెంచుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాటికి ఆహారంగా చికెన్ వ్యర్థాలను వేస్తుండడంతో చెరువులోని నీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాజకీయ నాయకుల అండ చూసుకొని కొందరు వ్యాపారులు ఈ చర్యకు పూనుకున్నట్లు తెలుస్తోంది. అధికారులు వెంటనే అప్రమత్తం కాకుంటే లక్షలాది లీటర్ల తాగునీరు వృథా అయ్యే ప్రమాదం ఉంది.

- చెరువులో చేపల పెంపకం
- వాటికి ఆహారంగా చికెన్ వ్యర్థాలు
- కొరవడిన నిఘా
- రాజకీయ అండతో రెచ్చిపోతున్న వ్యాపారులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి..

గత ప్రభుత్వ హయాంలో చెరువులోని నీరుకలుషితం కావడం, అది తాగిన అనేకమంది అస్వస్థతకు గురికావడం అప్పట్లో సంచలనంగా మారింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు చెరువు నీటిని ప్రజలకు సరఫరా చేయడాన్ని నిలిపివేశారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రూ.6లక్షల ఖర్చుతో చెరువులోని నీటిని మొత్తం బయటికి తోడేసి, రసాయనాలతో కూడిన పూడికను కూడా తొలగించారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన తాగు నీటి భద్రతపై చర్యలు తీసుకోవాల్సిన కౌన్సిల్ ఎలాంటి చర్యలు తీసుకోకపోయిన కారణంగా చెరువుపై నిఘా కొరవడింది . చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేసి, వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన తెరచాటుకు వెళ్లిపోవడంతో, చెరువు పరిరక్షణ మరుగున పడిపోయింది. 1100ఎంఎల్(మిలియన్ లీటర్ల) సామర్థ్యం కలిగిఉన్న ఈచెరువులో ప్రస్తుతం 800 ఎంఎల్(మిలియన్ లీటర్ల) నీరు నిలువ ఉంది. ఇప్పటికైనా అధికారులు అప్రమత్తం కాకుంటే లక్షలాది లీటర్‌ల తాగునీరు వృథా అయ్యే ప్రమాదం ఉంది.

నీరు కలుషితం కాకుండా..

ఎల్ఎల్‌సీ కాలువలో తాగునీటి విడుదల చేయనంత వరకు రాంజల చెరువు నీటిని సమీపంలో ఉన్న కొన్నికాలనీలకు సరఫరా చేశారు. ప్రస్తుతం కెనాల్ నీటినే ప్రజలకు అందిస్తున్నా, వేసవికాలంలో కెనాల్‌లో నీటి సరఫరా ఉండదు కాబట్టి తిరిగి రాంజల చెరువు నీటినే వాడుకోవాల్సి ఉంది. చెరువులోని నీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, చెరువులో చేపలు వదిలిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



తాగునీటి చెరువును చేపల చెరువుగా మార్చిన వారు ఎంతటి వారైనా కఠినచర్యలు తీసుకోవాల్సిందే. అధికారులు వెంటనే స్పందించి పోలీస్‌లకు ఫిర్యాదు చేయాలి. లేకుంటే ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తాం.

● బి. రామచంద్ర, మాజీ కౌన్సిలర్, ఆదోని

మూడు స్టేషన్లలో ఫిర్యాదు చేశాం



రాంజల చెరువులో కొందరు చేపలను వదిలినట్లు ఫిర్యాదులు వచ్చిన మాట వాస్తవమే. ఒకటో, రెండో, మూడో పట్టణ పోలీస్‌స్టేషన్లలో ఈవిషయంపై ఫిర్యాదు కూడా చేశాం. తాగునీటిని కలుషితం చేస్తే కఠినచర్యలు ఉంటాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించడానికే కృషి చేస్తున్నాం.

● కృష్ణ, మున్సిపల్ కమిషనర్, ఆదోని

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ రంజిత్ బాషా



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఆదివాసీలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గానూ, పంచాయతీరాజ్ కమిషనర్‌గా కూడా తాను పని చేయడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ శాఖకు డైరెక్టర్‌గా ఉన్న సమయంలో తండాలను పంచాయతీలుగా చేయాలనే విజ్ఞప్తులు మొదట అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి వచ్చాయన్నారు. సంబంధిత అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఒకే రోజు 160తండాలను పంచాయతీలుగా మార్చినట్లు తెలిపారు. గవర్నమెంటు ఆఫ్ ఇండియా నుంచి ఒకే రోజు 11 అవార్డులను తీసుకున్నామన్నారు. కర్నూలు జిల్లాలో రూ.180 కోట్లతో సీసీ రోడ్లు వేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. పదో తరగతిలో గిరిజన పాఠశాలల్లో 94 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మాట్లాడుతూ ఫ్లోరైడ్ సమస్యలు ఉన్న గిరిజన గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి సమస్యను తీరుస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు కొండయ్య, రాధిక, ఎరుకుల పోరాట సమితి స్టూడెంట్స్ అధ్యక్షుడు చంద్రప్ప, డీవీఎస్‌సీ సభ్యులు మాలతి, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

కర్నూలు క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా శనివారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్, కిడ్స్ వరల్డ్, పూలబజారు, గాంధీ చౌక్, మించిన్‌బజారు, కాంగ్రెస్ కార్యాలయం మీదుగా కొండారెడ్డి బురుజు వరకు ఈ ర్యాలీ జరిగింది. స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పేందుకే ప్రజలకు ఇబ్బందులు, సమస్యలు ఎదురైతే తక్షణ సాయం అందిస్తామని, రానున్న వినాయకచవితి, స్వాతంత్ర్య వేడుకలు ప్రశాంతంగా జరిగేందుకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ ర్యాలీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండెంట్ విజయకుమార్ వర్మ, అసిస్టెంట్ కమాండెంట్ పాపరావు కీర్తి, ఇన్‌స్పెక్టర్లు బి.రాజు, భారతి, పట్టణ సీఐలు నాగరాజరావు, శేషయ్య, మన్సూరుద్దీన్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో లంచగొండి రాజ్యం

- ఎమ్మెల్యేలు బియ్యం అమ్ముకోవడానికి అంగళ్లు తెరిచారు
- జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ
- నగరంలో రెపరెపలాడిన ఎర్రజెండాలు
- ఆకట్టుకున్న కళాకారుల గేయాలు, నృత్యాలు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లంచగొండి రాజ్యం నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. శనివారం నగరంలోని పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా 24వ మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా జిల్లా పరిషత్ నుంచి కళాకారులు, నాయకులు, కార్యకర్తలతో భారీ ఊరేగింపుగా పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. నగరం అంతా ఎర్రజెండాలతో రెపరెపలాడింది. మహాసభలకు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి.రామచంద్రయ్య, జగదీశ్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె.రామాంజనేయులు, ఆవుల శేఖర్, లెనిన్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో 1.47లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని, కూటమి ఎమ్మెల్యే బియ్యం అమ్ముకోవడానికి అంగళ్లు తెరిచారని విమర్శించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.20వేల కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. టీడీపీ-జనసేన పార్టీ నాయకులు రాష్ట్రంలో సుపరిపాలన జరుగుతుందని ప్రచారాలు చేస్తున్నారని, లంచం లేకుండా ఎక్కడ ఏ కార్యాలయంలో పని జరగడం లేదన్న విషయం పాలకులు తెలుసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ, ఎవరూ చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రూ.1,75,000 వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. ఇదే నెలలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్‌లో జాతీయ మహాసభలు చండీఘర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. కళాకారులు ఆలపించిన గేయాలు, నృత్యాలు పలువురిని ఆకర్షించాయి. వివిధ ప్రాంతాల్లోని స్థూపాల నుంచి తీసుకువచ్చిన అరుణ పతాకాలను అతిథులకు అందజేశారు. అమరవీరులకు జోహర్లు అర్పించారు. కార్యక్రమంలో మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కె .జగన్నాథం, సలహాదారుడు భీమలింగప్ప, జే.లలితమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి, రామకృష్ణారెడ్డి, అజయ్‌బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, రబిరసూల్, పంపన్నగౌడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



నృత్యం చేస్తున్న కళాకారులు

తుంగభద్ర తీరం సాహిత్యం

సీమ ఫ్యాక్షన్ కథా సంకలనం నిచ్చెన



రచయిత ఇనాయతుల్లా



కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని పల్లెల్లో రాజ్యమేలిన ముఠాకక్షలు, వాటికి ఆధిపత్యం వహిస్తున్న పెత్తందారి నాయకుల మధ్య నలిగిపోయిన బహుజన కులాల అనుచరుల వ్యథలను వ్యక్తం చేసే కథల సమూహారమే 'నిచ్చెన' కథా సంపుటిలోని కథలు. కర్నూలు చెందిన కథారచయిత ఇనాయతుల్లా రాసిన ఈ కథా సంకలనంలో అనేక అంశాలను ఆయన స్పృశిస్తూపోయారు. ఒకప్పుడు పాశావికంగా తలలు నరుకునే స్వభావం నుంచి రాజకీయ నేపథ్యంలో కుర్చీల కుమ్ములాట పోరు వరకు ఈ సంకలనంలోని కథలు తెలియజేస్తాయి. నిచ్చెన కథలో కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలోని ఒకనాటి నాయకుల ఆధిపత్య స్వభావాన్ని, దాని కోసం వారు సాగించిన నరమేధాన్ని కళ్లకు కట్టినట్లు ఆ కథల్లో చిత్రీకరించారు. అలాగే వలస అనే కథలో పల్లెల నుంచి బడుగు, బలహీనవర్గాల ప్రజలు జీవనోపాదికి తట్టబుట్ట సర్దుకుని వలసలు వెళ్లిపోవడం వారి బ్రతుకు చిత్రాలకు అద్దం పడుతుంది. 1990 ప్రాంతంలో అప్పటి పాలకులు జన్మభూమి పథకం ద్వారా ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించి గ్రామీణ కూలీల జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన విధానం కూడా కథల్లో కనిపిస్తాయి. గ్రామాల్లో రిజర్వేషన్ల పుణ్యమా అని రాజకీయ పదవులు అనగారిన వర్గాలకు లభించినా ఆధిపత్యం మాత్రం ఉన్నత వర్గాలకే అని కొన్ని కథలు తెలియజేస్తాయి. ఒక ఫ్యాక్షన్ నాయకుడిని నమ్ముకుని సేవలు చేసే అనుచరుడు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించిన విధానాన్ని నిచ్చెన అనే కథలో రచయిత హృద్యంగా వివరిస్తారు. ఈ సంకలనంలో ముస్లిం మైనార్టీల బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే కథలు గూడు, ముసుగు, పురుడు వంటి కథలు పాఠకులను అలరింపజేస్తాయి. 'గుప్పెడు గుండె' అనే మరో కథ నగరాల్లో బలహీనమవుతున్న మానవ సంబంధాలను తెలియజేస్తుంది. ఒకనాడు పల్లెల్లో సామూహికంగా కలిసి బతికిన మనిషి నేడు అపార్టుమెంటు కల్చర్‌లో ఏకాకిగా మారిపోయిన విధానాన్ని ఆయన చక్కగా వర్ణించారు. పల్లెల్లో జరిగే దసరా, సంక్రాంతి, ఉగాది, పీర్ల పండుగ సంబరాలను తెలియజేసే కథల్లో 30-40 దశాబ్దాల క్రితం పల్లెల్లోని సంస్కృతిని ప్రతిబింబింపజేస్తాయి. నిచ్చెన కథల సంకలనానికి సుప్రసిద్ధ సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి ముందుమాట రాశారు. కథాసమయం సాహితీ సంస్థ వేత్తలు ఇనయతుల్లాను కథకునిగా పరిచయం చేశారు. లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ జయప్రకాష్ నారాయణ కూడా అసెంబ్లీ సమావేశాల్లో రాయలసీమ ఫ్యాక్షన్ అంశాన్ని నిచ్చెన కథల సంపుటి లోని అంశాలను ప్రస్తావిస్తూ మాట్లాడారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తుంది.

చౌడేశ్వరీమాతకు వెండి శ్రీచక్రం విరాళం



వెండి శ్రీచక్రం విరాళం అందిస్తున్న దాతలు

బనగానపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీ మాత అమ్మవారికి బెంగుళూరుకు చెందిన పీవీ.రావు కుటుంబ సభ్యులు వెండి శ్రీచక్రం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి శనివారం అందించారు. అమ్మవారిమీద భక్తితో రూ.1.17లక్షల విలువగల వెండి శ్రీచక్రం విరాళం ఇచ్చారు.

టార్గెట్‌బాల్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

● అభినందించిన ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

పాణ్యం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు టార్గెట్‌బాల్ రాష్ట్రస్థాయి ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ దినేష్‌బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 8, 9వ తేదీల్లో తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన అసోసియేషన్ జూనియర్స్ మీట్‌లో బాలుర విభాగంలో టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనబరచి తృతీయ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గురు రాఘవేంద్ర నమో నమః



పుష్కరిణిలో తెప్పోత్సవం నుంచి మాట్లాడుతున్న పీఠాధిపతి

5వ పేజీ తరువాయి

శ్రీమఠంలో పీఠాధిపతి టీటీడీ పట్టువస్త్రాలను తలపై మోసుకుని వచ్చి బృందావనం ముందు ఉంచి హారతులు ఇచ్చి ఊంజల మండపం వద్ద పీఠాధిపతికి పట్టువస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రసాదం తెచ్చిన టీటీడీ అధికారి రామకృష్ణకు పీఠాధిపతి శేసవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు.

పుష్కరిణిలో తెప్పోత్సవం..

రూ.3.50 కోట్లతో బెంగుళూరు చెందిన ప్రకాశ్‌శెట్టి అను భక్తుడు నిర్మించి విరాళంగా ఇచ్చిన పుష్కరిణిలో ఉత్సవమూర్తి ప్రహ్లాద రాయలు తెప్పోత్సవంలో విహరించారు. వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాలు మధ్య తెప్పోత్సవంలో స్వామివారి పుష్కరిణిలో విహరిస్తుండగా 'తుంగా తీరా నివాసా'.. మంత్రాలయం నివాసా గోవిందా గోవిందా.. జయహో గురు రాఘవేంద్ర విజయహో అంటూ భక్తులు పెద్దఎత్తున నినాదాలు చేసి పరవశించారు. మంత్రాలయంలో తొలిసారి పుష్కరిణి ఏర్పాటుచేసి తెప్పోత్సవం నిర్వహించడంతో పులకరించిపోయి తన్మయం చెందారు.

నేడు పూర్వారాధన

రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ప్రాముఖ్య దినమైన ఆదివారం రాఘవేంద్రస్వామి పూర్వారాధన కార్యక్రమం జరగనుంది.



శాకోత్సవం చేస్తున్న పీఠాధిపతి

350 మంది పోలీసులతో ఉత్సవాల బందోబస్తు
ఏర్పాట్లును పరిశీలించిన డీఎస్పీలు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న డీఎస్పీలు

శ్రీమఠంలో ఉత్సవాల్లో భాగంగా ప్రధాన వేడుకలు జరిగే 10, 11, 12 తేదీల్లో 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎమ్మిగనూరు, కర్నూలు, పత్తికొండ డీఎస్పీలు ఎంఎస్ భార్గవి, బాబు ప్రసాద్, వెంకట్రామయ్య తెలిపారు. ఈమేరకు శనివారం వారు ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలీసులకు పలు సూచనలు చేశామన్నారు. వీరి వెంట మంత్రాలయం సీఐ రామాంజులు, శ్రీనివాస్ నాయక్, ఎస్ఐ శివాంజల్, గోపినాథ్, పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేటి పూజలు

రాఘవేంద్రస్వామి 354వ ఆరాధన మహోత్సవాల్లో జరిగే మూడో రోజు ఆదివారం జరిగే పూజా కార్యక్రమాలు..


- తెల్లవారుజాము 4గంటల నుంచి 5గంటల వరకు బృంధావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం. అనంతరం 5 నుంచి 6 గంటల వరకు క్షీరాభిషేకం
- ఉదయం 6నుంచి 8.30గంటల వరకు ప్రహ్లాదరాయులకు పాదపూజ, పంచామృతాభిషేకం. ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం
- ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు పీఠాధిపతుల సంస్థాన పూజ,
- మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు అలంకరణ సంతార్పణ, హస్తోదకం. మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు మహామంగళహారతి, తీర్థప్రసాదాలు.
- సాయంత్రం 5 గంటలకు జ్ఞాన యజ్ఞం. రాత్రి 8.30 గంటలకు రథోత్సవాల్లో భాగంగా సింహ వాహనంపై ప్రహ్లాదరాయలు దర్శనమివ్వనున్నారు.

నేడు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరాధన ఉత్సవాల్లో మూడో రోజు ఆదివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు బెంగుళూరుకు చెందిన వెంకటేశ్ అండ్ బృందం వారిచే నాగసరంగి, 6.30 నుంచి 8.30 గంటల వరు రాఘవేంద్ర ప్రవస్తి అవార్డులు ప్రదానం, రాయచూరు చెందిన కర్ణాటక కళామండలం వారిచే నృత్య రూపకం భక్తులను అలరించనున్నాయి.

ఆకట్టుకున్న భరతనాట్యం

ఉత్సవాల్లో రెండో రోజు శనివారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో ఉడిపికి చెందిన భార్గవి నృత్య తాండా బృందం వారిచే భరత నాట్యం అలరించింది. చెన్నైకి చెందిన కన్యాకుమారి వాయిలీన్ వాయిద్యం, పుత్తూరు చెందిన జగదీష్ వారిచే దాసవాని సాహిత్యం అలరించింది. కళాకారులకు పీఠాధిపతి శేషవస్త్రం, జ్ఞాపిక, నగదు, ఫల, పుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించి ఆశీర్వదించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు



పల్లకిపై ఉత్సవమూర్తి విహారం

భక్తులతో కిక్కిరిసిన రణమండల కొండ

● శ్రావణమాసం మూడో శనివారం ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



మెట్లమార్గంలో కొండపైకి వస్తున్న భక్తులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతంలోని రణ మండల కొండపై శ్రావణమాస పూజల కోసం వచ్చిన భక్తులతో కొండ కిటకిటలాడింది. శ్రావణమాసం మూడో శనివారం కావడంతో ఆదోని ప్రాంత భక్తులే కాకుండా జిల్లా నలుమూల నుంచి కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన భక్తులు ఆ రణమండల ఆంజనేయుడిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజామునే స్వామివారికి సింధూర అర్చన, హారతి, పంచామృతాభిషేకం, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేపట్టారు. పల్లకీ సేవ అనంతరం మధ్యాహ్నం భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం ఏర్పాటు చేసింది. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. దాతల సాయంతో పట్టణంలోని శ్రీనివాస భవన్ నుంచి రణమండల కొండపైకి తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు.



ఆంజనేయుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు

ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా సమావేశం శనివారం కర్నూలు మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర సహాయ అధ్యక్షులు హేమంత్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా జగన్నాథం, శ్రీధర్‌మూర్తి ఎన్నికయ్యారు. సహాయ అధ్యక్షుడిగా సిద్ధు, ట్రెజరర్‌గా సురేష్, ఉపాధ్యాక్షులుగా సుధాకర్ రెడ్డి, లక్ష్మన్న, రవికుమార్, జాయింట్ సెక్రటరీలుగా శ్రీనివాసులు మహేష్, హుస్సేన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అంకాలప్ప నాయుడు, రియాజ్ బాషా, బలరాం తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు.



ఏపీ పంచాయతీ కార్యదర్శుల సంఘం కార్యవర్గ సభ్యులు

ఏజెంట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా పని చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కమీషన్ పద్ధతిని డైరెక్ట్ ఏజెంట్స్‌ను నియమిస్తారని వివరించారు. పదో తరగతి పాసై ఆపైన చదివి 18సంవత్సరాలు పూర్తయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20వరకు (ఆదివారం మినహా) ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరిక్రిష్ణారెడ్డి సెల్‌నెంబర్: 7013029312కు సంప్రదించాలని కోరారు.

అన్నదానానికి రూ.1,00,116 విరాళం



దాతలకు స్వామివారి జ్ఞాపికను బహూకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆత్మకూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు వంశీధర్‌సింగ్, నిఖిత సుమ దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. శనివారం అన్నదాన కమిటీ చైర్మన్ రామయ్యకు అప్పగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారిని ఘ నంగా సత్కరించారు. అర్చకులు వారికి వేదాశీర్వచనాలు అందజేసి స్వామివారి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం సజావుగా సాగుతోందన్నారు. కార్యక్రమంలో జక్కా మురళీ, పెద్దన్న, వెంకటరెడ్డి, శ్రీనివాసులు, అర్చకులు అనిల్‌కుమార్, సుధేంద్ర తదితరులు ఉన్నారు.

జీవితమే కష్టాల పాన్పు



అన్నం తినిపిస్తున్న మనువరాలు

- చిన్నతనంలోనే దూరమైన తల్లిదండ్రులు
- కొన్నాళ్లు అనాథశ్రయంలో..
- మూడేళ్ల క్రితం జేజమ్మకు పక్షవాతం
- పరశురాంపైనే కుటుంబ భారం

ఆ ఇద్దరు పిల్లల జీవితం కష్టాల కడలిలో సాగుతోంది. చిన్న వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయారు. జేజమ్మ ఇతరుల సహాయంతో వీరిని అనాథశ్రమంలో చేర్పించింది. కొన్నాళ్ల పాటు అక్కడే ఉండి చదువుకున్నారు. అంతా సవ్యంగా సాగుతున్నాయని అనుకున్న తరుణంలో మరోసారి విధి వీరితో వింత నాటకమాడింది. జేజమ్మ అయిన లింగమ్మ పక్షవాతం బారిన పడింది. అంతే మళ్లీ ఈ చిన్నారులకు కష్టాలు మొదలయ్యాయి. జేజమ్మను మనీషా సపర్యలు చేస్తూ కంటికి రెప్పల్లా కాపాడుకుంటోంది. కుటుంబ భారమంతా మనవడు పరశురాం' పై పడింది. నిరంతరం కష్టాలతో సాగుతున్న వీరి జీవితంపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

కోడుమూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో కురువ లింగమ్మ అనే వృద్ధురాలు నివసిస్తోంది. ఆమె కుటుంబ దీనగాథ ప్రతి ఒక్కరికీ కన్నీళ్లను తెప్పిస్తాయి. లింగమ్మ పెద్ద కుమారుడు మస్తాన్, కోడలు షేకున్‌లకు కొడుకు పరుశురాం, కూతరు మనీషా సంతానం. పెద్దగా ఆస్తిపాస్తులు లేని వారు అప్పట్లో కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు. 12 ఏళ్ల క్రితం కోడలు శేకున్ కామెర్లతో మృతి చెందడం, ఆపై ఏడాదిలోగా కొడుకు మస్తాన్ కూడా కడుపునొప్పి కారణంగా చనిపోవడం లింగమ్మను కుంగదీశాయి.

కుటుంబ బాధ్యత లింగమ్మపైనే..

తల్లిదండ్రులు మృతిచెందినప్పుడు పరశురాం వయస్సు ఆరేళ్లు. మనీషాకు కేవలం నాలుగు సంవత్సరాలు మాత్రమే. వీరి ఆలనా పాలనా చూసే వారు ఎవరూ లేకపోవడంతో ఆబాధ్యత అంతా జేజమ్మ అయిన లింగమ్మ మీదే పడింది. దీంతో ఆమె తెలిసిన వారి సహకారంతో పిల్లలను ఓ అనాథాశ్రమంలో చేర్పించింది. అక్కడే కొన్నేళ్ల పాటు పిల్లలు చదువుకున్నారు.

పక్షవాతం సోకడంతో..

మూడేళ్ల క్రితం లింగమ్మకు పక్షవాతం సోకింది. లేవలేని పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో అనాథాశ్రమంలో ఉన్న పిల్లలను తీసుకువచ్చారు. పిల్లల చదువు మధ్యలో ఆగిపోయింది. లింగమ్మకు పింఛన్ వస్తోంది. ఆ డబ్బులు ఆమెకు ఖర్చులు, మందు లకు సరిపోతాయి. దీనికితోడు లింగమ్మకు సాయంగా ఓ మనిషి ఉండాల్సిన పరిస్థితి. స్నానం చేయించడం, దుస్తులు మార్చడం, అన్నపానీయాలు అందించడం వంటి పనులను మనీషా చూస్తుంది.



బేల్దార్ పనులకు వెళ్తూ..



బేల్దారి పని చేస్తున్న పరశురాం

పరశురాం రోజూ బేల్దారి పనులకు వెళ్తాడు. అలా వచ్చిన కూలీ డబ్బులతో కుటుం బాన్ని నెట్టుకొస్తున్నాడు. పరశురాం పనికి వెళ్లగా వచ్చిన డబ్బులతోనే ఇల్లు గడుస్తుంది. ఏదైనా జ్వరం, అనారోగ్యం కలిగి పనికి వెళ్లకపోతే అప్పు చేయాల్సిన పరిస్థితి. నివసిస్తున్న మట్టిమిద్దె కూడా కూలిపోయి అరుగు మాత్రమే మిగిలి ఉంది. దినదినం అతికష్టం మీద నెట్టుకొస్తున్నారు. ఇల్లు బాగుచేసుకునే అవకాశం ఎక్కడిదని పరశురాం కన్నీటి పర్యంతమయ్యాడు. కొందరికి జీవితం పాలపాన్పు కావచ్చేమో పరశురాంకు సుడిగుండమే.

వ్యక్తిపై కేసు నమోదు

బండిఆత్మకూరు ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన రాజారెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ శనివారం తెలిపారు. మండలంలోని కడమలకాల్వకు చెందిన రాజేష్ అనే వ్యక్తికి చెందిన కారును రాజారెడ్డి బాడుగకు తీసుకున్నాడు. ఇంతవరకు బాడుగ చెల్లించలేదని, కారు ఇవ్వలేదని రాజేశ్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డోన్ రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వెంకటాపురం గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. డోన్ పట్టణం ఇందిరానగర్‌కు చెందిన నూర్‌బాషా (40) బైక్‌పై వెంకటాపురం రోడ్డులో వెళ్తుండగా.. కంబలపాడు నుంచి ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొన్నది. దాంతో నూర్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వచ్చిన భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై దాడి

బనగానపల్లె, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని చెర్వుపల్లె గ్రామానికి చెందిన అయినాబాషా తన భార్యపై దాడి చేశాడు. వివరాలివీ.. నంద్యాలకు చెందిన షేక్ అయిషాకు ఎనిమిదేళ్ల క్రితం చెర్వుపల్లె గ్రామానికి చెందిన అయినాబాషాతో వివాహమైంది. అయితే గత నాలుగేళ్ల నుంచి అయినా తాగుడుకు బానిసై, మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని అయిషాను శారీరకంగా, మానసికంగా నిత్యం వేధించేవాడు. శనివారం ఇంట్లో అయిషా తలపై భర్త కట్టెతో కొట్టాడు. దీంతో ఆమెకు రక్తగాయాలయ్యాయి. అయిషా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కానిస్టేబుల్‌పై జనసేన నాయకుడి దాడి

నంద్యాల టౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్యాట్ పార్టీ కానిస్టేబుల్‌పై జనసేన నాయకుడు, అనుచరులు దాడి చేశారు. ఈఘటన నంద్యాల పట్టణ శివారులోని రైతునగరంలో శుక్రవారం చోటుచేసుకున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణ శివారులో గుట్కా అమ్ముతున్నారన్న సమాచారం మేరకు క్యాట్ పార్టీ పోలీస్ అక్కడికి వెళ్లి ఇలాంటి పనులు చేయకూడదు అన్నందుకు కానిస్టేబుల్ మనిపై జనసేన నాయకుడు సుధాకర్, ఆయన అనుచరులు జయంత్, మరో ఇద్దరు దాడి చేశారు. జనసేన నాయకుడు మాత్రం కానిస్టేబుల్ డబ్బులు అడిగినందుకు వాగ్వాదం జరిగిందని చెబుతున్నారు. బాధితుడు మని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నలుగురి అరెస్టు



నిందితుల అరెస్టును చూపిస్తున్న సీఐ యుగంధర్

- బంగారం, నగదు స్వాధీనం

ఆళ్లగడ్డ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్సేన్‌రెడ్డి వీధిలో ఈనెల 2న జరిగిన చోరీ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బండల వ్యాపారం చేసుకొని జీవిస్తున్న సంజీవరాయుడు అనే వ్యక్తి ఈనెల 2న అర్ధరాత్రి తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో చర్చిలో ప్రార్థనకు వెళ్లారు. ఆ సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి రూ.1,27,500 నగదు, మూడు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఈ కేసుకు సంబంధించి టౌన్ ఎస్ఐ జయప్ప పోలీసు సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి వారం రోజులలోనే కేసును ఛేదించినట్లు తెలిపారు. సంతోష్, విజయ భాస్కర్, నాగేంద్ర, వరలక్ష్మిని అరెస్టు చేసి నగదు, బంగారంను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సీఐ యుగంధర్, ఎస్ఐ జయప్ప, కానిస్టేబుల్ రఫీ, అక్బర్, హోంగార్డు శేఖర్‌ను ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ ప్రమోద్ అభినందించారు.

కర్నూలు జీజీహెచ్‌లో రెండు అరుదైన ఆపరేషన్లు



రోగులతో సూపరింటెండెంట్, సర్జరీ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యులు రెండు అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు అరుదైన శస్త్ర చికిత్సలను నిర్వహించిన సీనియర్ ప్రొఫెసర్ రామకృష్ణ నాయక్, ప్రొఫెసర్ జయరాంతో పాటు వైద్యబృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా శనివారం జనరల్ సర్జరీ రెండో యూనిట్ చీఫ్ ప్రొఫెసర్ రామకృష్ణ నాయక్ విలేకరులతో మాట్లాడారు. బేతంచెర్లకు చెందిన 25 ఏళ్ల సుమలత తరుచూ రక్తవాంతులు, అధిక రక్తస్రావం ప్యాన్సైట్రోసెనీయా కారణంగా పునరావృత రక్తమార్పిడి తీసుకుంటున్నారన్నారు. గతంలో ఈవీఎల్ బ్యాండిల్ చేయించుకున్న రోగి గత నెల 15వ తేదీన ఆసుపత్రిలో చేరిందన్నారు. ఈ నెల 24వ తేదీన స్ప్లినెక్టమీ అనంతరం స్ప్లినోరెనాల్ షంట్ శస్త్ర చికిత్సను నిర్వహించామన్నారు. తర్వాత ప్లీహం (స్ప్లీన్) పరిమాణం 20/15 సెం.మీల బరువు మారుగా 1.5 కిలోలుగా నమోదైందన్నారు. ఆపరేషన్‌కు ముందు రోగి ప్లేట్‌లెట్ల సంఖ్య 40 వేలు ఉండగా.. ఆపరేషన్ తర్వాత 5 లక్షలకు పెరిగి ఆరోగ్యంగా ఉండటంతో ఈ నెల 9వ తేదీ డిశ్చార్జ్ చేశామన్నారు. రెండో కేసు గోనెగండ్లకు చెందిన రంగస్వామి (53) మద్యపానం అలవాటు ఉంది. తరుచూ కడుపునొప్పితో బాధపడుతున్నారు. రోగి జూన్ 6వ తేదీ ఆసుపత్రిలో అడ్మిషన్ పొందారు. పరీక్షలు నిర్వహించగా క్రానిక్ కేల్సిఫిక్ పాంక్రియాటైటిస్‌గా నిర్ధారణ అయింది. దీంతో అదే నెల జూన్ 29వ తేదీ లాటరల్ ప్యాంక్రియాటీ కోజేజునోస్టమీ చేశారు. ఆపరేషన్‌లో పాంక్రియాస్‌లో సుమారు 10 రాళ్లు, అతిపెద్దది, 3/2 సెంటీమీటర్ పరిమాణంలో ఉండటం అరుదైన అంశంగా గుర్తించారు. జూలై 7వ తేదీన రోగిని డిశ్చార్జ్ చేశారు. ఈ రెండు కేసులు పూర్తిగా ఆరోగ్యంగా ఉండటంతో వైద్యులు విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆపరేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్లు సబీరా, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రణీత్, ప్రశాంతి, అనస్తీషియా వైద్యులు సుధీర్, అరుణలత, సంజీవకుమార్, పీజీలు పాల్గొన్నారు.

వెల్దుర్తిలో బాలికకు డెంగీ?

- మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలింపు

వెల్దుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 9వ వార్డుకు చెందిన ఓ బాలికకు డెంగీ లక్షణాలు కనిపించాయి. జ్వరంతో మూడు రోజుల నుంచి బాధపడుతున్న బాలిక వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకుంది. అయినా నయం కాకపోవడంతో వైద్యుల సలహా మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లారు. గ్రామంలో దోమల బెడద అధికంగా ఉందని, పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిభావంతుల కోసమే..

- ఔత్సాహిక క్రీడాకారులకు సువర్ణ అవకాశం
- 2029జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా
- ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా పండుగగా జరిపించేందుకు కృషి
- ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు జోనల్‌స్థాయి పోటీలు
- 16నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు

ఔత్సాహిక క్రీడాకారులకు కూటమి ప్రభుత్వం సువర్ణ అవకాశం ఇచ్చింది. వీరిలో ప్రతిభను వెలికితీసేందుకు సన్నాహాలు చేస్తోంది. అమరావతిలో 2500ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని క్రీడాకారులకు అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాలు అందుబాటులోకి రానున్నాయి. ఆగస్టు 29న ధ్యానచంద్ జయంతి సందర్భంగా క్రీడా పండుగను ఘనంగా నిర్వహించేందుకు శాప్ చైర్మన్ కృషి చేస్తున్నారు. శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉత్సాహం చూపుతున్నారు. తిరుపతిలో జరిగే జోనల్‌స్థాయి పోటీలు ఈ 11నుంచి 14వరకు, విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 16నుంచి 20వరకు నిర్వహించనున్నారు.





బాక్సింగ్ పోటీ

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): 22ఏళ్ల లోపు క్రీడాకారులు తమ ప్రతిభను చూపేందుకు జిల్లా, జోన్, రాష్ట్రస్థాయి పోటీలను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు సన్నాహాలు చేసింది. 2029.లో అమరావతిలో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఔత్సాహిక క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే రాష్ట్రవ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. అమరావతిలో దాదాపు 2500ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నిర్మాణం పూర్తయితే రాష్ట్రంలోని క్రీడాకారులకు అత్యాధునిక వసతులతో క్రీడా మైదానాలు అందుబాటులోకి రానున్నాయి. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జరిగే జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఈ ఏడాది ఆగస్టు 29న ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొన్నేళ్లుగా జాతీయ క్రీడాదినోత్సవం నామమాత్రంగా జరుపుకుంటుండగా ఈఏడాది ప్రత్యేకంగా శాప్ చైర్మన్ రవినాయుడు ప్రోత్సాహంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పండుగ జరపనున్నారు. మూడు దశల్లో నిర్వహించే ఈ క్రీడాపోటీలకు శాప్ ఖర్చులు భరించనుంది.

పది క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు..

పది క్రీడాంశాల్లో స్త్రీ, పురుషులకు పోటీలు నిర్వహిస్తారు. ముందుగా జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి అక్కడ గెలుపొందినవారిని తిరుపతిలో జరిగే జోన్‌స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. జోనల్ విజేతలకు రాష్ట్ర స్థాయి పోటీలు విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తారు. శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఉత్సాహం చూపుతున్నారు. ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రంలోని పద్మావతినగర్ డీఎస్ఏ మైదానం, ఎస్పీజీ పాఠశాల మైదానం, ఆర్జీఎం క్రీడామైదానాల్లో జరిగిన పోటీల్లో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేశారు. తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీలు ఈనెల 11నుంచి 14వరకు, విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 16నుంచి 20వరకు నిర్వహించనున్నారు.

క్రీడా విభాగాలివి.. ఆర్చరీ, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో 100 మీటర్లు, 400మీటర్లు, 4 ఇంటు 400మీటర్లు రిలే, 800మీటర్లు, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లలో పోటీలు నిర్వహిస్తారు.



శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే..

క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకే పోటీలు నిర్వహిస్తున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు శాప్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా అకాడమీల్లో అవకాశం కల్పిస్తారు. జిల్లాస్థాయి పోటీల్లో మంచిస్పందన లభించింది. క్రీడల అభి వృద్ధికి ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయి. జిల్లాలో క్రీడాసంఘాల ప్రతి నిధులు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో జిల్లాస్థాయి పోటీలు విజయవంతం చేశాం. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు, క్రీడాకారులు తిరుపతిలో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. **- ఎంఎస్‌వీ రాజు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, నంద్యాల**



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అదరగొడుతున్న అన్నదమ్ముళ్లు

- క్రికెట్ పోటీల్లో రాణిస్తున్న నంద్యాల సోదరులు
- బ్యాటింగ్‌లో ఒకరు.. బౌలింగ్‌లో మరొకరు
- ప్రశంసలు అందుకుంటున్న సాయిగణేశ్, సాయివిఘ్నేశ్

వారిద్దరికీ చిన్నప్పటి నుంచే క్రీడలంటే మక్కువ. పైగా క్రికెట్ అంటే మరింత ఇష్టం. అందరిలాగే క్రికెట్‌ను ఒక ఆటగా చూడలేదు.. లక్ష్యంగా ఎంచుకున్నారు. సాధన చేస్తే సాధించనిది ఏదీ లేదంటూ ముందడుగు వేశారు. ఇష్టం ఒకవైపు.. తల్లిదండ్రుల ప్రోత్సాహం మరోవైపు.. వెరసి అన్నదమ్ముళ్లు క్రికెట్‌లో అదరగొడుతున్నారు. అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. సాయిగణేశ్ బ్యాటింగ్ రాణిస్తుండగా.. సాయివిఘ్నేశ్ బౌలింగ్‌లో ప్రతిభ చాటుతున్నాడు. దేశం తరపున ఆడడమే తమ లక్ష్యమంటూ చెబుతున్న నంద్యాలకు చెందిన సోదరులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నంద్యాల రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రాజా, సుమలత దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో సాయిగణేశ్ డిగ్రీ, సాయివిఘ్నేశవ్ ఇంటర్ చదువుతున్నారు. తండ్రి స్థానిక పురపాలక పాఠశాలలో 'ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తల్లి గృహిణిగా ఉన్నారు. చిన్నప్పటి బ్యాట్ పట్టుకుని తిరుగుతుండడం గమనించిన తండ్రి క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. దీంతో వారు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి స్థానిక శాంతిరాం సంస్థల ఎండీ రఘురాం ప్రోత్సాహంతో స్థానికంగా ఉన్న బెస్ట్ క్రికెట్ ఆకాడమిలో కోచింగ్ తీసుకుంటున్నారు. ఎప్పటికైనా దేశం తరపున ఆడాలన్న ఆశతో నిరంతరం శిక్షణ తీసకుని అటు క్రీడల్లో, ఇటు చదువులో రాణిస్తున్నారు.



సాయిగణేశ్, సాయివిఘ్నేశ్

బ్యాటింగ్‌లో సాయిగణేశ్ ప్రతిభ

- 2023లో వెంకటగిరిలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ -16 క్రికెట్ పోటీల్లో బ్యాటింగ్‌లో ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలు సాధించి ప్రశంసా పత్రాలు అందుకున్నాడు.
- 2023లో అస్సాంలో జరిగిన రాష్ట్ర ప్రాబబుల్స్‌లో బీసీసీఐ డొమెస్టిక్ ఆడి నంద్యాల నుంచి మొదటి క్రికెటర్‌గా ఘనత సాధించాడు.
- 2025లో కడపలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ -19 క్రికెట్ పోటీల్లో (టెస్టులు) 274 పరుగులు సాధించి బహుమతి అందుకున్నారు.
- 2025లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆంధ్ర-బి జట్టులో స్థానం సాధించి 87 పరుగులతో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు.

లెగ్ స్పిన్‌తో రాణిస్తున్న సాయివిఘ్నేశ్

- 2023లో వెంకటగిరిలో జరిగిన అండర్ -16 క్రికెట్ పోటీల్లో 4 టెస్ట్ మ్యాచ్‌ల్లో 14 వికెట్లతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.
- 2024లో అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌లో ప్రతిభ కనబరిచి బహుమతి అందుకున్నారు.
- 2025లో కడపలో క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో మూడు టెస్టుల్లో 17 వికెట్లు తీసీ జట్టు విజయానికి కృషి చేశారు.
- 2025లో కడపలో జరిగిన క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు తరపున ఏకంగా ఆరు వికెట్లు తీసి జట్టుకు విజయం అందించి బహుమతి అందుకున్నారు.

మాజీ ఆర్మీ అధికారి ఇంటిపై ఎక్సైజ్ దాడులు

- 53 డిఫెన్స్ మద్యం బాటిళ్లు సీజ్
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు



స్వాధీనం చేసుకున్న డిఫెన్స్ లిక్కర్‌ను చూపుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది

కర్నూలు అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మాజీ ఆర్మీ అధికారి ఇంటిపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించింది. డిఫెన్స్‌కు సంబంధించిన 53 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్‌బాబు తెలిపారు. వివరాలు.. ముందస్తుగా అందిన సమాచారం మేరకు.. శనివారం నగరంలోని తిరుమలగిరి టౌన్ షిప్ వద్ద మాజీ ఆర్మీ నగేష్ రావు ఇంట్లో తనిఖీలు నిర్వహించాం. డేవర్స్ విస్కీ-18, బ్లాక్ డాగ్ గోల్డ్- 12, బ్లాక్ డాగ్ బ్లాక్-12, రాక్‌ఫోర్డ్ 11 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని పరిశీలించగా 'ఆర్మీడు పేరా మిలిటరీ ఫోర్సెస్ ఆర్మీ పర్సనల్‌కు మాత్రమే అమ్మబడును అని ఉంది.

వీటిని ఎక్కడి నుంచి తెచ్చారని ప్రశ్నించగా, బెంగళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో తీసుకుని ఇక్కడ అధిక రేట్లకు అమ్మేందుకు తెచ్చినట్లు చెప్పారు. వాటిని స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డి, సీఐలు చంద్రహాస్, రాజేంద్ర ప్రసాద్, ఎస్ఐలు రెహనాబేగం, ఇంద్రకరణ్ తేజ, సిబ్బంది రామలింగ, చంద్రపాల్, రాణి, లాలప్ప, తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

ఘనంగా మహాలక్ష్మీ యాగం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పౌర్ణమి పురస్కరించుకొని మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ లోని గంగా సమేత మరకతలింగేశ్వరుని స్వామి ఆలయంలో శనివారం ఘనంగా మహాలక్ష్మీ యాగంను నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత కనుమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో మరకతలింగేశ్వరునికి ఉదయం ప్రత్యేక ఋత్వికులు గణపతి పూజ, పుణ్యాహవాచనము, అభిషేక పూజ లను వేదమంత్రాలతో జరిపారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాల మంటపాల్లో వందలాది మంది భక్తులు పాల్గొనగా మహాలక్ష్మీ యాగంను భక్తి శ్రద్ధల తో జరిపారు. వివిధ ద్రవ్యాలతో పూర్ణాహుతిని నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో ప్రముఖులు

- ఘనస్వాగతం పలికిన మఠం అధికారులు
- ఆశీర్వదించిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



మహా ముఖద్వారం వద్ద తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి

మంత్రాలయం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో రెండో రోజు శనివారం రాత్రి పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ యువజన క్రీడలు, పశుసంవర్ధకశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, కర్ణాటక హైకోర్టు జడ్జిలు జస్టిస్ శ్రీషానంద, జస్టిస్ టీఎం నదాఫ్, కర్ణాటక డిప్యూటీ సోషలిటర్ జనరల్ జడ్జి జస్టిస్ శాంతిభూషణ్, జస్టిస్ జ్యోతి ముళిమణి వేర్వేరు సమయాల్లో రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. వీరికి శ్రీమఠం అధికారులు ఎస్కే శ్రీనివాసరావు, ఎస్కే కేశవ్ విఠల్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్‌లు ఘన స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామిని దర్శించుకుని పీఠాధిపతి ఆశిస్సులు పొందారు. వీరి వెంట ఏఏవో మాధవశెట్టి, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ పాల్గొన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ప్రభుత్వ విద్యను కాపాడడమే 'ఐసా' లక్ష్యం



ఏఐఎస్ఏ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను కాపాడడమే ఐసా ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర కార్యదర్శి ఏ.నాగరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.నాగార్జున తెలిపారు. ఐసా 35వ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా నగరంలో శనివారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉపాధిని, ప్రాథమిక హక్కుగా ప్రకటించాలని పోరాటాలు చేస్తూనే విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. విద్య సమాన హక్కు, అధిక ఫీజులు, లింగ, కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా పోరాడుతూ పాట్నా, అలహాబాదు, ఢిల్లీ యూనివర్సిటీ, ఆర్‌యూ యూనివర్సిటీల్లో వ్యతిరేక విధానాలపై ఐసా గళం వినిపిస్తుందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అదే విధంగా అడుగులు వేయడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో ఐసా పట్టణ నాయకులు అశోక్, కిరణ్ పాల్గొన్నారు.

బీసీల అండగా టీడీపీ

● చంద్రబాబు, పవన్, లోకేశ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం



రాజ్‌విహార్‌లో చంద్రబాబు, లోకేశ్, పవన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మద్యం పాలసీలో గౌడ కులస్థులకు న్యాయం చేసి బీసీలకు టీడీపీ అండగా నిలిచిందని ఈడిగ రాష్ట్ర కన్వీనర్ అమర్నాథ్ గౌడ్ అన్నారు. శనివారం నగరంలోని రాజవీహార్ సమీపంలోని కేఈ ప్లాజా వద్ద కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు సత్రం రామక్రిష్ణ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేస్ గౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ లిక్కర్ షాప్‌ల్లో 10 శాతం లైసెన్సు 50 శాతం ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈడిగ, గౌడ్, శ్రీశైన, యాతా, శెట్టి బలిజలకు కూటమి పాలనలో న్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్యామ్‌గౌడ్, ఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బజాపార్, గౌడ సంఘం నాయకులు భాస్కర్‌గౌడ్, శేఖరగౌడ్, టీడీపి, బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా నినాదంతోనే స్వాతంత్ర్యం



కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్విట్ ఇండియా నినాదంతోనే స్వాతంత్ర్యం వచ్చిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో 84వ క్విట్ ఇండియా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి కొండారెడ్డి బురుజు వరకు వెళ్లి అక్కడి పార్క్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, యువజన కాంగ్రెస్ నాయకులు మహేంద్రనాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్‌సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, రియాజుద్దీన్, ఐన్‌టీయూసీ నాయకులు రేపల్లే ప్రతాప్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

'భూములు మా పేరుపై మార్పించాలి'

కర్నూలు క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేటు సంస్థ తమ భూములను మార్టిగేజ్ చేసినట్లుగా చూపించి ఈసీలో వచ్చే విధంగా చేసి మోసం చేసిందని కల్లూరు మండలం బొల్లవరం గ్రామానికి చెందిన రైతులు కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేశారు. తాము ఆ సంస్థ వద్ద ఎలాంటి రుణాలు తీసుకోలేదని వారు తెలిపారు. బ్యాంకు రుణాల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళితే తాము ఆ సంస్థ పేరుతో మార్టిగేజ్ చేసినట్లుగా వస్తుందని సీఐ దృష్టికి తీసుకువచ్చారు. ఆ సంస్థ ఉద్యోగుల వద్దకు వెళ్లి ప్రశ్నిస్తే.. వారు స్పందించడం లేదని సబ్ రిజిస్ట్రార్ కూడా దీనిపై నోరు మెదపడం లేదన్నారు. సబ్ రిజిస్ట్రార్ అధికారులు ఆ సంస్థతో కుమ్మక్కై తమ భూములను మార్చేసుకున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు.



నిరుపయోగంగా ఉన్న పాఠశాల గదులు



శిథిలావస్థలో సొసైటీ కార్యాలయం

నిర్మించారు.. వదిలేశారు..!

● ప్రభుత్వ నిధులు దుర్వినియోగం
● పట్టించుకోని అధికారులు

ఓర్వకల్లు, ఆగస్టు 9 ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామంలో ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏళ్లనాటి భవనాలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పాఠశాల ప్రాంగణంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రెండు గదులు, సహకార పరపతి సంఘం, హెల్త్ సెంటర్ల సంస్థ కార్యాలయాలు ఉన్నాయి. ఈ భవనాలకు మరమ్మతులు చేపడితే ఏదో ఒకదానికి ఉపయోగించవచ్చునని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కార్యాలయాలకు ఉన్న కిటికీలు, తలుపులు కొందరు వ్యక్తులు అపహరించుకెళ్లారు. ఐదు భవనాలు నిరూపయోగంగా ఉన్నప్పటికీ కొత్త భవనాలు మంజూరు చేసి నిర్మించడం సబబు కాదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలకు మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజాధనం దుర్వినియోగమే



పాఠశాల ప్రాంగణంలో ఐదు ప్రభుత్వ భవనాలు నిరూపయోగంగా మారాయి. ప్రజాధనం దుర్వినియోగమే. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

● గడేకారి శేఖర్, గ్రామస్థుడు

మరమ్మతులు చేపట్టండి



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలకు మరమ్మతులు చేస్తే ఉపయోగంలోకి వస్తాయి. దీంతో రూ.30 లక్షలకు పైగా భవనాలు నిర్మించారే తప్పా మరమ్మతులకు నోచుకోలేదు.

● నాగరాజు, స్థానికుడు





గూడూరు మండలం పెంచికలపాడు వక్కెర వాగుపై పొంగి ప్రవహిస్తున్న వరద

భారీ వర్షం

గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. మండలంలో 69.8 మి.మీ., వర్ష పాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. వక్కెర వాగు పొంగి పొర్లింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచిపోయింది. పెంచికలపాడు బ్రిడ్జిపై వరద వచ్చి చేరడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు 5 గంటల పాటు వరద ప్రవాహం కొనసాగడంతో వాహన దారులు మరో దారి వెంట ప్రయాణం సాగించారు. వక్కెర వాగుపై ఉన్న బ్రిడ్జిని ఎత్తును పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కోడుమూరు రూరల్: మండల పరిధిలో శనివారం తెల్లవారుజామున భారీవర్షం కురిసింది. దాదాపు ఇరవై రోజులకుపైగా వర్షం జాడ లేకపోవడంతో పైరులు బెట్టదశకు చేరుకున్నాయి. సుమారు గంటకుపైగా వర్షం పడడంతో పైర్లకు జీవం పోసిందని రైతులు తెలిపారు. భారీవర్షం కారణంగా లోతట్టు పొలాల్లో నీళ్ల నిలిచాయి. గోరంట్ల వద్ద హంద్రీనది ఉధృతంగా ప్రవహించింది.


డీఈవోను సస్పెండ్ చేయాలి



డీఈవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాలు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని వామపక్ష పార్టీల విద్యార్థి సంఘాలు పీడీఎస్‌యూ, ఏఐఎస్ఏ, యూఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌వో, బీసీ, ఎస్సీ ఎస్టీ , మైనార్టీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. నాగరాజు, బి.మహేంద్ర బాబు, ఉదయ్‌కుమార్, శేఖర్, సురేంద్రబాబు, నాగార్జున మాట్లాడుతూ డీఈవో విద్యార్హతపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి పీజీటీఎస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలకు టీషర్టులు, జీన్స్ ప్యాంట్లతో విధులకు హాజరు కావడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. మహిళా ఉపాధ్యాయునులతో డ్యాన్స్ చేస్తూ ఉండడం సిగ్గు చేటన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీ పాఠశాలల తనిఖీ పర్యవేక్షణను గాలికి వదిలేశారన్నారు. డీఈవోపై విచారణ చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దయ్య, జనార్దన్, ఆర్యన్, రాజు, వీరేష్, హర్షవర్దన్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడం దుర్మార్గం



పుస్తకం ఆవిష్కరిస్తున్న న్యాయవాది జయరాజు, విరసం నేతలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యం కుట్రపూరితంగా వ్యవహరించి ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడం దుర్మార్గమని ప్రముఖ న్యాయవాది జయరాజు అన్నారు. శనివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో విప్లవ రచయితల సంఘం (విరసం) ఆధ్వర్యంలో ఆదివాసి హక్కుల నేత స్టాన్ స్వామి రచించిన జైలు డైరీ 'నేను మౌన ప్రేక్షకుణ్ణి కాను' పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రముఖ విమర్శకులు డా.నాగేశ్వరాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఈ దేశంలో పౌరులకు న్యాయం అందడం లేదని స్టాన్ స్వామి ఉదంతమే ఉదాహరణ అన్నారు. నేరస్థులు తప్పించుకుని తిరుగుతున్నారని, నేరం చేయని వాళ్లు బందీలౌతున్నారని అన్నారు. ఈ పుస్తకం నివాళి కాదని ఇది ప్రగతిశీల వాదులకు కార్యచరణగా భావించాలన్నారు. సభలో విరసం నాయకులు పాణీ, అరుణ్ ప్రసంగించారు.

టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడికి అభినందనలు



పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న సాహితీ స్రవంతి ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపికైన పత్తి ఓబులయ్యను సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ జిల్లా అధ్యక్షులు ఆవుల చక్రపాణి యాదవ్ శనివారం అభినందించారు. నాటక, సాహితీ రంగాలకు మరిన్ని సేవలు అందించాలని కోరారు. అనంతరం పత్తి ఓబులయ్యను శాలువతో సత్కరించారు.

మోటార్లకు మరమ్మతులు చేపట్టాలి

సి. బెళగల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మండలంలో ఉన్న గురురాఘవేంద్ర, చింతమానుపల్లె, రేమట ఎత్తిపోతల పథకాల నుంచి జూలైలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కేడీసీబీ చైర్మన్ ఎదురూర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్‌బీసీ చైర్మన్ గుడిపాడు మహేశ్వరరెడ్డి నీటిని విడుదల చేశారు. అయితే మండలంలోనే క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం మోటార్ల చెడిపోవడంతో ఈ పథకాన్ని ప్రారంభించలేదు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఎత్తిపోతల పథకం కింద ఉల్లి, మిరప, వరి, వేరుశనగ పంటలను రైతులు సాగు చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేపట్టి పంట పొలాలకు నీరందించాలని రైతులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): 2006 బ్యాచ్‌కు చెందిన ఇంటర్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సెయింట్ మేరీస్ జూనియర్ కాలేజీలో శనివారం జరిగింది. ఈ సమ్మేళనంలో అప్పటి అధ్యాపకులు పత్తి ఓబులయ్య, పి.దస్తగిరి బ్యాంకింగ్ జేఆర్ గిడ్డి మద్దిలేటి రెడ్డి సుధాకర్, బాలశౌరి, నాగన్న అప్పటి కరస్పాండెంట్ పీకే జోష్‌లను సత్కరించారు. విద్యార్థులు రసూల్ బాషా, చాంద్‌బాషా, మారేష్ తదితరులు మాట్లాడుతూ అప్పటి గురువులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల రోమన్ క్యాథలిక్ మేనేజ్మెంట్‌లో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అలనాటి విద్యార్థులు చిన్నస్వామి, నాగశివుడు, లక్ష్మన్న, నాగశంకర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

దళితులకు వైఎస్ జగన్ క్షమాపణ చెప్పాలి

● టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి చిన్నమారెన్న

కల్లూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దళిత వ్యతిరేకి వైసీపీ అని, తక్షణమే మాజీ సీఎం జగన్ దళితులకు క్షమాపణ చెప్పాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపురం చిన్నమారెన్న శనివారం డిమాండ్ చేశారు. జగన్ తన కాన్వాయ్ ఢీకొని దళిత వృద్ధుడు సింగయ్య ప్రాణాలు కోల్పోయాడని, అది మరువక మరువక ముందే తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరుడు అనిల్‌రెడ్డి దళిత యువకుడిని గదిలో బంధించి క్రూరంగా దాడి చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు ఒక వ్యక్తిపై జరిగిన మింస మాత్రమే కాదు యావత్తూ దళిత సమాజాన్ని అవమానపరిచే, భయపేట్టే ప్రయాత్నాలన్నారు. దళిత హక్కులు, భద్రత, గౌరవం పట్ల వైసీపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, దళితులపై దాడి చేసిన నేతలను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా సంతాన నాగదేవత ప్రభోత్సవం



గూడూరులో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన సంతాన నాగదేవత ప్రభ మహోత్సవం వైభవంగా జరిగింది. శనివారం అమ్మవారి ఆలయంలో సంతాన నాగదేవత అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

గూడూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఎంపీపీ కే.సునీత అధ్యక్షతన ఇన్‌చార్జి ఎంపీడీవో మధులత మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కొన్ని శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరై నివేదికలు చదివి వినిపించారు. ఆయా గ్రామాల సర్పంచులు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వానికి నివేదికలు పంపామని అధికారులు తెలిపారు. సమావేశంలో అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకులకు స్వాగతం పలికిన సీపీఎం



సీపీఐ నాయకులకు స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత బస్టాండులో జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలకు విచ్చేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులకు సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. శనివారం కోట్ల కూడలిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సి.గురుశేఖర్, టి.రాముడు, నాయకులు మహ్మద్, హుస్సేన్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

చెరువులను తలపిస్తున్న రోడ్లు



గుంతల వద్ద నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో గుంతల రోడ్లు చెరువును తలపిస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అన్నారు. శనివారం డీవైఎఫ్ఐ బృందం నగరంలోని పాత ఈద్గా, గాయత్రి హస్పిటల్, బళ్లారి చౌరస్తా,హెచ్‌పీ పెట్రోల్ బంకు, వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతాల్లో గుంతలు పడిన రోడ్లను పరిశీలించారు. అబ్దుల్లా మాట్లాడుతూ నగరంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యానికి గుంతలు రోడ్లు నిదర్శనమన్నారు. మంత్రి నియోజకవర్గంలో గుంతలు పడ్డ రోడ్లు ప్రమాకరంగా ఉంటే ఇతరులకు ఎలాంటి ఆదర్శం చూపిస్తారని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు రాఘవేంద్ర, నాయకులు సాయి ఉదయ్, విశ్వనాథ్, రఘువరన్, కిరన్, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'రక్తసంబంధం' సినిమా ప్రదర్శన

కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సాయంత్రం 6 గంటలకు సినిమా రక్తసంబంధం టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు పత్తి ఓబులయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నా చెల్లెళ్ల అనుబంధం వివరించే రాఖీ పండుగను పురస్కరించుకుని ఈ సినిమాను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఎన్టీఆర్, సావిత్రి అన్నా చెల్లెళ్లుగా నటించిన ఏకైక సినిమా ప్రదర్శనకు ఉచితంగా ఉంటుందని తెలిపారు.

సామాజిక స్పృహను కలిగించేవి పండుగలే

● గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్తా



మాట్లాడుతున్న మారం నాగరాజు గుప్త

కర్నూలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహను కలిగించేవి పండుగలేనని గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్తా అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీగోదా రంగనాథస్వామి దేవస్థానం గోదా గోకులంలో ఏర్పాటు చేసిన రక్షాబంధన్ కార్యక్రమంలో రక్షాబంధన్ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో తరిగొండ వెంగమాంబ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు పసుపులేటి నీలిమ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డా.మల్లు వెంకటరెడ్డి, గోదా గోకులం ట్రస్టీ పల్లర్ల నాగరాజు, తల్లం నాగ నారాయణ రావు, వేముల జనార్దన్, వేద పండితులు కృష్ణమాచార్యుల బృందం, ఇటిక్యాల పుల్లయ్య, నరహరి నాగభూషణం, లింగం వెంకట కృష్ణయ్య, సురేష్, కస్తూరి శేషయ్య, బాల సుధాకర్ చిత్రాల వీరయ్యతో పాటు భక్తులు పాల్గొన్నారు.



సెట్కూరు సీఈవో వేణుగోపాల్‌కు డీఎస్పీ మహబూబ్ బాషాకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్: యువజన సర్వీసుల శాఖ, సెట్కూరు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కృష్ణానగర్ లోని బీసీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థినుల చేత సీఈవో వేణుగోపాల్‌కు, ఏపీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషాకు తిరంగ రాఖీలు విద్యార్థినులు కట్టారు. కార్యక్రమంలో అసిస్టెంట సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు, హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు రాఖీ కట్టిన వైద్యులు



రాఖీ కట్టిన రోగులతో వైద్యులు

కర్నూలు హాస్పిటల్: చికిత్స పొందుతున్న రోగుల ముఖాల్లో ఆనందం నింపి వారికి కుటుంబ వాతావరణాన్ని అందించాలన్న ఉద్దేశంతో కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌లో రాఖీ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించింది. శనివారం హాస్పిటల్‌లో రోగులకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది రాఖీలు కట్టి, మిఠాయిలు పంచి స్నేహభావాన్ని పంచుకున్నారు. రాఖీ వేడుకల్లో హాస్పిటల్ కర్నూలు సెంటర్ వై.మహేశ్వరరెడ్డి, హాస్పిటల్ యురోగైనకాలజిస్టు ప్రసూతి వైద్యురాలు డా.శిల్పాచౌదరి, పల్మనాలజిస్టు డా.సువర్ణలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాణం తీస్తున్న పశువులు

- ఆలూరులో ప్రధాన రహదారులపై తిష్ట
- వాహనదారులు, పాదాచారులపై దాడులు
- గురువారం ఆవుల దాడిలో వృద్ధుడి మృతి


పట్టణంలో రహదారిపై ఆవులు


7-8-25(గురువారం)న మృతిచెందిన వృద్ధుడు

ఆలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పశువులు విచ్చలవిడిగా తిరుగుతూ వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. ఆవులు, ఎద్దులను యజమానులు పట్టించుకోవడం లేదు. వీటిని వదిలేస్తుండటంతో అవి రోడ్లపై తిష్టవేస్తున్నాయి. ఆలూరులో ఇలా రోడ్లపై 50కిపైగానే పశువులు సంచరిస్తున్నాయి.

ప్రధాన రహదారిపై తిష్ట

మార్కెట్ మెయిన్ బజార్‌లో ప్రధాన రహదారిపై తిష్ట వేస్తున్నాయి. దీంతో రోడ్డుపై నడవాలంటేనే పాదాచారులు, వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. పశువుల దాడిలో గురువారం ఆలూరుకు చెందిన పద్మనాభదాస్(80) అనే వృద్ధుడు మృతిచెందిన విషయం విదితమే. గతంలో పాత బస్టాండులో పశువుల మధ్య పొట్లాట బీభత్సంగా జరిగింది.

గోశాలకు తరలించాలని ఆందోళన

సమస్యను పరిష్కరించాలని పలుమార్లు కోరినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. పశువుల దాడిలో వ్యక్తి మృతిచెందడంతో సీపీఎం నాయకులు, ప్రజలు ఆలూరు అంబేడ్కర్ కూడలిలో ఆందోళన చేశారు. అధికారులు స్పందించి పశువులను తరలించాలని కోరుతున్నారు.

ముందే హెచ్చరించిన ఆంధ్రజ్యోతి



31-7-25న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

పశువులు రోడ్లపై తిష్ట వేశాయని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. అప్పుడే అధికారులు స్పందించి వుంటే ఓ నిండు ప్రాణం పోయేది కాదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు, పంచాయతీ అధికారులు సమన్వయం చేసుకుని పశువులను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



గోశాలకు తరలించాలి

రహదారిపై తిష్టవేసిన పశువులను గోశాలకు తరలించాలి. పలుమార్లు ఆందోళన చేసినా స్పందించడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి. - నారాయణస్వామి, సీపీఎం నాయకుడు

స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించాం

రహదారిపై తిష్టవేసిన పశువులను తీసుకెళ్లాలని ఇప్పటికే యజమానులను స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించాం. ఇటీవల పశువుల దాడిలో వ్యక్తి మృతిచెందడంతో పంచాయతీ అధికారుల ద్వారా యజమానులకు నోటీసులు జారీ చేయించాం. రేపటిలోగా స్పందించకుంటే యజమానులపై కేసు పెడతాం. - మహబూబ్‌బాషా, ఎస్‌ఐ, ఆలూరు



రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

మద్దికెర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కులవృత్తిపై ఆధారపడిన రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆ సంఘం అధ్యక్షుడు చిరంజీవి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ల్యాండ్రీ షాపులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. మండలంలో వెయ్యికిపైగా రజక కుటుంబాలు పైగా ఉన్నాయ న్నారు. అలాగే రజకులకు పరికరాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమం సంఘం నాయకులు రంగన్న, వెంకప్ప ఉన్నారు.

ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి


మాట్లాడుతున్న సంఘం నాయకుడు ఆంజనేయులు

మద్దికెర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించాలని సంఘం అధ్యక్షుడు కొమ్మేటి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించిన ప్రభుత్వం దివ్యాంగుకుఉ మాత్రం 50 శాతం రాయితీ ఇస్తోందన్నారు. కనీసం 70 శాతం పైగా వైకల్యం కలిగివారికి సదరం సర్టిఫికేట్ ఆధారంగా జీరో టికెట్ ఇవ్వాలని కోరారు. నాయకులు సురేష్, ప్రసన్నకుమారి, వీరాంజనేయులు, మల్లికార్జున, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం


విద్యార్థులకు ఆట వస్తువులు బహూకరిస్తున్న నాయకులు

ఆదోని టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను ఆ పార్టీ నాయకులు వై.మారుతీ రావు దేవిశెట్టి వీరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో కేకు కట్ చేశారు. విద్యార్థులకు ఆట వస్తువులను బహూకరించారు. దిలీప్ దోకా, సాయినాథ్, శ్రీనిత్ రాయల్, మాణిక్యరాజా, ఫరూక్, బండారి తాయన్న, రామన్న యాదవ్ పాల్గొన్నారు.

స్కావెంజర్లు చికిత్స చేయడంపై ఆగ్రహం

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్న వైసీపీ నాయకుడు


వైద్యుడు రామకృష్ణతో మాట్లాడుతున్న భాస్కర్‌నాయుడు

ఆలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో స్కావెంజర్లే సెలైన్ బాటిల్ ఎక్కించడం, బీపీ చెక్ చేయడంపై వైసీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. నర్సులు చేయాల్సిన పనులను స్కావెంజర్లు చేస్తుండటాన్ని గమనించి, వైద్యుడు రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. రోగుల ఆరోగ్యానికి ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారు అని ప్రశ్నించారు. స్పందించిన వైద్యుడు సిబ్బంది కొరతతో ఇలా జరిగి ఉంటుందని, ఇకమీదట జరగకుండా చూస్తామని వివరణ ఇచ్చారు. ఈ విషయంపై ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ద్వారా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని భాస్కర్‌నాయుడు తెలిపారు.

ముంపునకు కారణం వైసీపీ కౌన్సిలర్లే


కాలువలో పూడిక తీస్తున్న కార్మికులు

ఆదోని టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లోతట్టు ప్రాంతాల ముంపుకు వైసీపీ కౌన్సిలర్లే అని బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్ ఆరోపించారు. శనివారం మాట్లాడుతూ పురపాలక శాఖ మంత్రి నారాయణతో ఎమ్మెల్యే డా. పార్థసారధి మాట్లాడి పూడిక తొలగింపు పనులకు రూ. 1.20కోట్లు మంజూరు చేయించారన్నారు. అయితే పనుల ప్రారంభాన్ని కౌన్సిల్ సమావేశాలలో వైసీపీ కౌన్సిలర్లు అడ్డుకున్నారన్నారు. అప్పుడే పూడిక తొలగించి ఉంటే నేడు వందలాది కుటుంబాలు ఇబ్బందులు పడేవారు కాదన్నారు. మూడున్నరేళ్ల పట్టణ అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి నేడు ఎమ్మెల్యే అధికారులతో ప్రవేశపెట్టించిన అంశాలను కౌన్సిల్ సమావేశంలో వాయిదా వేయించారని తెలిపారు.

వైభవంగా దండల ఉత్సవం

దేవనకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్మామల గ్రామంలో దండల ఉత్సవం శనివారం నిర్వహించారు. ఏటా శ్రావణమాసం మూడో శనివారం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. గ్రామంలోని పురోహితుడి ఇంటి నుంచి అశ్వంతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామికొండ వద్దకు పల్లకీలో మూడు పూల దండలను తీసుకెళ్లి కొండచరియలో వదిలారు. ఎమ్మెల్యే విరుపాక్షి, దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ముంచిన వర్షం

- కొట్టుకుపోయిన వేరుశనగ కట్టలు.. రూ.2 లక్షల నష్టం
- రోళ్లపాడు తండాలో కొట్టుకుపోయిన పైపులైన్


ఎర్రగుడిలో వర్షం దెబ్బకు కొట్టుకుపోయిన వేరుశనగ కట్ట

తుగ్గలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి, ఉప్పర్లపల్లి, గ్రామం రోళ్లపాడు తండా, కడమకుంట్ల గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది.

కష్టం నీటిపాలు..

రైతులు వేరుశనగ కోత కోసి, కట్టలను పొలంలోనే ఉంచారు. ఒక్కసారిగా భారీ వర్షం కురవడతో ఆరుగాలం కష్టించి పండిచిన వేరుశనగ దిగుబడి నీళ్లలో కొట్టుకుపోయింది. రూ.లక్ష దాకా పంట నష్టం వచ్చిందని రైతులు భోరున విలపిస్తున్నారు. అలాగే రోళ్లపాడు తండాలో తాగునీటి పైపులైన్ కూడా కొట్టుకుపోవడంతో తాగునీటి ఇబ్బందులు తప్పేలా లేవు.

- జి.ఎర్రగుడికి చెందిన రైతు రాఘవేంద్ర రెండెరాల్లో వేరుశనగ సాగు చేశాడు. దిగుబడిని పొలంలో నిల్వ చేయగా.. తెల్లవారుజామున కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో తాను రూ.60వేల పైగా పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంట నీళ్లపాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతును ఆదుకోవాలని టీడీపీ నాయకులు చంద్ర, శేఖర్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు.
- జొన్నగిరి చెరువు నిండి కడిదొడ్డు ద్వారా నీళ్లు పారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. చెరువులు నిండటంతో జొన్నగిరి, ఉప్పర్లపల్లి గ్రామాల్లో సాగు, తాగునీరుకు ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు.


రోళ్లపాడు తండాలో కొట్టుకుపోయిన తాగునీటి పైపులైన్


వర్షపు నీటితో నిండి పొర్లిపారుతున్న జొన్నగిరి చెరువు

'శ్రావణ' సంబరాలు


రాత్రి మంగళ భక్తుల హారతులు

హాలహర్వి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రావణమాస మూడో శనివారం పూజలు నిర్వహించారు. నిట్రవట్టి గ్రామంలో గవ్వలతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హాలహర్వి నుంచి జె.హొసళ్లి గ్రామ కొండలో వెలిసిన బసవేశ్వర స్వామి, ఆంజనేయస్వామి పాదాలకు బిందుసేవతో పూజలు నిర్వహించారు. పూజ అనంతరం రథోత్సవం నిర్వహించారు.

హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న ప్రెసిడెంట్ నాగేంద్రప్ప

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పి.నాగేంద్రప్ప డిమాండ్ చేశారు. శనివారం ప్రాంతీయ కార్యాలయంలో మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని, మెరుగైన పీఆర్సీ అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. 12వ పీఆర్సీ ఇప్పటికే 12 నెలలు ఆలస్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతి, ఆర్థిక బకాయిలు చెల్లింపుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు. కాశీ విశ్వనాథ్ శాస్త్రి, నాగప్రసాద్, శ్రీనివాసులు, జ్యోతి మూర్తి పాల్గొన్నారు.

చినుకు.. చిత్తడి


కోయనగర్ రహదారి దుస్థితి

ఆలూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరికెర, కోయనగర్‌కు రహదారులపై వర్షపునీరు, మురుగు నిల్వ ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. డ్రెయినేజీ లేకపోవడంతో దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించాలని కోయనగర్ కాలనీవాసులు ఖాసీం, వలీ, ఈరన్న, మల్లయ్యలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చంద్రబాబుతోనే గిరిజనుల అభివృద్ధి


కర్నూలులో వెంకటపతికి జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్

తుగ్గలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే గిరిజనులు అభివృద్ధి చెందుతారని ట్రైబల్ వెల్ఫేర్ సలహా మండలి సభ్యుడు వెంకటపతి అన్నారు. శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ రంజిత్ బాషా, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు ఆయనను సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. సీఎం చంద్రబాబు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. తండాల్లో బీటీ, సీసీరోడ్లు నిర్మించారని తెలిపారు. రాబోయే రోజుల్లో గిరిజనులకు మరిన్ని నిధులు మంజూరు చేస్తారన్నారు. అనంతరం తుగ్గలి మండలం గిరిజన గ్రామాల సమస్యలను తెలియజేశారు.

విద్యార్థులకు పుస్తకాల వితరణ

వెల్దుర్తి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహ విద్యార్థులకు గూడూరు గ్రంథాలయ అధికారి కవితాబాయి శనివారం పుస్తకాలు అందజేశారు. కవితాబాయి మాట్లాడుతూ జాతీయ పుస్తక ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వసతి గృహానికి 200 సాహితీ పుస్తకాలు అందజేశామని, విద్యార్థినులు చదివి పుస్తకాభిషను పెంచుకోవాలని కోరారు.

వేడుకలకు అనుమతి ఇవ్వాలి


ఎస్ఐకి పత్రికలు అందజేస్తున్న సభ్యులు

తుగ్గలి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి వేడుకలకు అనుమతి ఇవ్వాలని త్రైత సిద్ధాంతం ప్రబోధా సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు అశోక్ కుమార్, నాయకుడు సురేష్ కోరారు. శనివారం జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జునకు పత్రికలు ఇచ్చారు. ఈ నెల 16న వేడుకలు నిర్వహిస్తామన్నారు. సభ్యులు చంద్ర, నబీ సాహేబ్, రామకృష్ణ ఉన్నారు.

వైభవంగా పరువు ఉత్సవం


పల్లకీ మోస్తున్న భక్తులు

ఆస్పరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుటకలమర్రి గ్రామంలో ఆంజనేయ స్వామికి పరువు ఉత్సవం నిర్వహించారు. బాజా భజంత్రీలతో గ్రామస్తులందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో ఊరేగించారు. రాత్రి భజన నిర్వహించారు. మోహన్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చంద్రరెడ్డి, చిన్న ఆంజనేయ, నరసప్ప పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

ఆలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఆలూరులో ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తమ్ముళ్లు, అన్నలకు రాఖీలు కట్టేందుకు తరలి వచ్చారు. చిన్నారులు సైతం రాఖీలు కొనుక్కొని తమ్ముళ్లకు, అన్నలకు కట్టారు.

తుగ్గలి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం రాఖీ పౌర్ణమి ఘనంగా నిర్వహించారు. అక్కా, చెల్లెళ్లు తమ తమ్ముడు, అన్నకు మిఠాయి తినిపించి, రాఖీ కట్టారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, ఎం.అగ్రహారం తదితర గ్రామాల్లో రాఖీ పండుగను నిర్వహించారు. అన్నా చెల్లెల్లు మిఠాయి తినిపించి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో కూటమిదే విజయం

ఆదోని టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులదే విజయమని అమరావతి నగర్ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన భీమ లింగప్ప, పూలరంగలను శనివారం సన్మానించారు. మహబూబ్ బాషా, శ్రీనివాసులు, రమేష్, ప్రదీప్, రాజేష్ పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న నాయకులు

మద్దికెర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు హనుమప్ప సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకుడు నాగరాజు, వ్యవసాయ సంఘం అధ్యక్షుడు కోదండ రాముడు అన్నారు. శనివారం హనుమప్ప స్థూపానికి నివాళులర్పించారు.

ఇష్టారాజ్యంగా మందులు

- అనుమతి లేని, 'బయో' పురుగు మందులను విక్రయిస్తున్న డీలర్లు
- వాటినే పంటలకు పిచికారీ చేస్తూ నష్టపోతున్న రైతులు



దేవనకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డీలర్లు ఇష్టానుసరంగా పురుగు మందులను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సందులో సడేమియా లాగా 'బయో' పేరుతో అనుమతి లేని మందులను కూడా రైతులకు అంటగడుతున్నారు. దేవనకొండ మండలంలో 15 గ్రామాలలో 67 పెస్టీసైడ్ దుకాణాలు ఉన్నాయి. పి.కోటకొండ, చెల్లెలచెలిమల, కప్పట్రాళ్ల, గుండ్లకొండ, తెర్నేకల్ తదితర గ్రామాలలో దుకాణాదారులకు పదో తరగతి పూర్తి చేయని వారు సైతం దుకాణాలు నడుపుతూ ఆనతికాలంలోనే రూ. లక్షల ఆదాయం సమకుర్చుకుంటున్నారు. మండలంలో పత్తి, వేరుశనగ, ఉల్లి, మిరప సాగు అధికంగా ఉంది. పంట సాగు నుంచి ఎదుగుదల కోసం, పూత, కాయ, అంటూ దాదాపు ఆరు నుంచి పదిసార్లకు పైగా రసాయానిక పురుగుల మందు పిచికారీ చేయల్సి వస్తుంది. దీంతో రైతులకు ఈ మందులు వాడితే అధిక దిగుబడులు వస్తాయని చెప్పి, విష ప్రభావం అధికంగా ఉన్న పురుగుల మందులను అమ్ముతున్నారు. మండలంలో మారుముల గ్రామాల్లో సైతం వీటిని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

డీలర్లకు అధిక ఆదాయం

సాధారణ పురుగు మందులతో వచ్చే ఆదాయం కంటే 'బయో' మందులతో అధిక ఆదాయం వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో డీలర్లు గుట్టుచప్పుడు కాకుండా వీటిని విక్రయిస్తున్నారు.

డీలర్ల మాయ

వీటిని వాడితే అధిక దిగుబడులు వస్తాయని ఆశచూపి దుకాణాదారులు రైతులకు అంటగడుతున్నారు. అనుమతులు పొందిన కంపెనీల మాదిరిగానే అక్షరం తేడాతో హోలోగ్రామ్‌ను ముద్రించి రైతులను మోసం చేస్తున్నారు.

ఆరోగ్యంపై ప్రభావం

విచ్చలవిడిగా బయో మందులు పిచికారీ చేస్తే మనుషుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అధికారుల తనిఖీలు అంతంతమాత్రంగానే ఉండటంతో దుకాణదారులు ఆడిందే ఆట పాడిందే పాటగా ఉంది.

ఉన్నతాధికారుల దృష్టికి..



బయో మందులు ఎవరూ అమ్మకూడదు. గత జూన్ 12వరకే అనుమతి ముగిసింది. ఇంకా ఎవరైనా అమ్ముతుంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. - ఉషారాణి, ఏవో

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి

● డివిజన్‌లో ఇప్పటి వరకు 1.20 లక్షల ఎకరాల్లో సాగు



గోనెగండ్లలో సాగు చేసిన సజ్జ పంట



సాగు చేసిన కొర్ర పంట



సాగు చేసిన జొన్న పంట

గోనెగండ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మిగనూరు డివిజన్ పరిధిలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు ప్రాంతాల రైతులు చిరుధాన్యాల సాగు చేయడంపై మక్కువ చూపుతున్నారు. ఈ సీజన్‌లో నియోజకవర్గం పరిధిలో రైతులు ఆశించిన మేరనే సాగు చేస్తున్నారు. డివిజన్‌లో 1.5 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1.20 లక్షల ఎకరాల్లో సాగయ్యింది. ఇందులో ఎక్కువగా పత్తి పంటను సాగు చేశారు. కొందరు రైతులు కొర్ర, సజ్జ, రాగులు, జొన్న పంటలను అంతర్ పంటలుగా సాగు చేస్తున్నారు. ఇటీవల చిరధాన్యాల వాడకం పెరిగింది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు ప్రకటనలు చేస్తుండటంతో చిరుధాన్యల వాడకం మరింత పెరిగింది. పల్లెలు, పట్టణాలలో ఎక్కువ మంది చిరుధాన్యాలనే ఆహారంగా వాడుతుండటంతో వాటికి మంచి గిరాకీ పెరిగింది. వైద్యులు కూడా చిరుధాన్యాలను వ్యాధి గ్రస్థులు వాడాలని చెప్పడంతో ఈ పంటలకు మరింత డిమాండ్ పెరిగింది. పశువులు ఎక్కువగా ఉన్న రైతులు గ్రాసం కోసమైన తప్పని సరిగా చిరుధాన్యలు సాగు చేస్తున్నారు.

చిరుధాన్యాల సాగు: ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు, మండలాల్లో రైతులు అంతర్ పంటలుగా చిరు ధాన్యాలను సాగుచేస్తున్నారు. కొర్ర పంటను నియోజకవర్గంలో 1000 ఎకరాలలో సజ్జ, కొర్ర, జొన్న, మినుములు, అంటుకొర్రలు రాగులు, తదితర పంటలను సాగు చేస్తున్నారు. వీటికి నీరు కట్టడం, మందులు చల్లటం కూడా తక్కువ కావడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువ:
చిరు ధాన్యాల సాగుకు పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుంది. ఈ పంటలను అంతర్ పంటలుగా సాగుచేస్తారు. ఈ పంటలు క్వింటం ధర రూ. 6వేల నుంచి రూ. 14వేల వరకు పలుకుతుంది. పశువులకు మేతకూడా వస్తుంది కావున ఈ మేతతో పాడి పశువుల రైతులకు గ్రాసం భారం తగ్గుతుంది. పాడి కూడా పెరుగుతోంది. కావున రైతులు ప్రస్తుతం ఎక్కువగా ఈ పంటల సాగుకు ఇష్టపడుతున్నారు. గోనెగండ్ల మండలంలో గాజులదిన్నె, కులుమాల, పెద్దనేలటూరు, చిన్నమరివీడు, చిన్ననేలటూరు, తిప్పనూరు, వేముగోడు, ఎర్రబాడు, హెచ్ కైరవాడి, నందవరం మండలంలో గురుజాల, ముగతి, నందవరం, మిట్టసోమాపురం, పూలచింత, సోమలగూడురు, నది కైరవాడి, ఎమ్మిగనూరు మండలంలోని 10 గ్రామాల్లో ఈ పంటలు అధికంగాసాగు చేస్తున్నారు.

కొర్ర వర్షాధార పంట: కొర్ర పంట కేవలం 100 రోజుల్లో పంట చేతికి అందుతోంది. ఎకరాకు 10, 12 బస్తాలు దిగుబడి వస్తోంది. అన్ని పంటల్లా కొర్ర పంటకు నీటి అవసరం పెద్దగా ఉండదు, కేవలం వర్షం పై ఆధారపడి పంట పండించవచ్చనే ఉద్దేశంతో పంటకు ఎటువంటి పిచికారీ మందులు గానీ ఎరువులు అవసరం లేకున్నా గానీ భూమిలోని సారాన్ని బట్టి మంచి దిగుబడి సాధించే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

సజ్జ, కొర్ర సాగు చేశా

నేను రెండు ఎకరాల్లో సజ్జ, కొర్ర పంటలు సాగు చేశాను. ప్రతి ఏడాది సజ్జ, కొర్రను సాగు చేస్తాను. ఈ పంటకు మంచి గిరాకీ కూడా ఉంది. మార్కెట్‌లో ఎప్పుడైన ధర పలుకుతుంది. ఆరోగ్యానికి అవసరం అని చాల మంది ఇంటి దగ్గరకే వచ్చి పండిన కొర్ర, సజ్జలను విడిగా కొనుకొని వెలతారు. పెట్టుబడికూడా పెద్దగా ఉండదు. మంచి లాభాలు వస్తాయి.

జయరాముడు, పిల్లిగుండ్ల,

చిరుధాన్యాల సాగుపై రైతుల ఆసక్తి

చిరుధాన్యాలు పంటల గురించి రైతులకు ఎంత చెప్పిన పట్టించుకునేవారు కాదు. ఇటీవల రైతులు చిరుధాన్యాలసాగుపట్ల మక్కువ చూపుతున్నారు. అట్టుకొర్రకూడా సాగు చేస్తున్నారు. ఈ పంటల్లో ఫైబర్ ఉన్నట్లు వైద్యులు తెలపడంతో చాల మంది ఆరోగ్యం కోసం ఈ ధాన్యాలను వాడుతున్నారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల విలువలను జోడించే యంత్రాలు ఉన్నాయి. వాటికి ఉపయోగించి మార్కెట్ లో మంచి ధరను పొందవచ్చును.

మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

ఫిజియోథెరపీతో హీమోఫిలియా నయం



కిట్లు పంపిణీ చేస్తున్న చాప్టర్ హీమోఫిలియా సొసైటీ సభ్యులు

గోనెగండ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపీ ద్వారా హీమోఫిలియా వ్యాధిని నయం చేయవచ్చునని వైద్యులు రంగారవళి, విశ్వనాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో చాప్టర్ హీమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని హీమోఫిలియా వ్యాధి గ్రస్తులకు అవగాహన కార్యక్రమాన్ని హీమోఫిలియా సొసైటీ సభ్యులు పార్థసారథి, నాగరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఫిజియోథెరపీతో ఏ విధంగా వ్యాధి నివారణ చర్యలు తీసుకోవచ్చునో వివరించడమే గాక వ్యాధిగ్రస్థులకు చికిత్సనందించారు.

జీడీపీకి వరద



జీడీపీకి చేరిన వరద

గోనెగండ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టుకు రెండురోజులుగా వరద వచ్చి చేరుతోంది. దీంతో జీడీపీ వరద నీటితో కళకళలాడుతోంది. ప్రస్తుతం జీడీపీలో 1.85 టీఎంసీల నీరు వచ్చి చేరింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా జీడీపీకి వరద నీరు వచ్చి చేరిందని జీడీపీ అధికారులు తెలిపారు. 2022 నుంచి జీడీపీకి వదరనీరు రాలేదు. 2025 మూడేళ్ల తరువాత వరద నీరు వచ్చి చేరుతుండటంతో జీడీపీకి నూతన కళ వచ్చింది. రెండు రోజులుగా దాదాపు రోజుకు 2000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జీడీపీలోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహాసభలకు సీపీఐ కార్యకర్తలు



కర్నూలుకు వెళ్తున్న సీపీఐ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలకు ఎమ్మిగనూరు పట్టణం, మండలం నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఎమ్మిగనూరు నుంచి మొత్తం 23 వాహనాల్లో సీపీఐ కార్యకర్తలు కర్నూలుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ పేదల పక్షాన పనిచేసే పార్టీ సీపీఐ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో ప్రజలు, రైతులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో సమస్యల పరిష్కారం కోసం చేపట్టే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటలు చేస్తామని, మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు



జ్యోతులను ఊరేగిస్తున్న తొగట వీరక్షత్రియులు

కోసిగి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని కడాపాలెం, సిద్దప్పపాలెంలో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవార్ల జ్యోతుల ఉత్సవాలు తొగట వీర క్షత్రియుల కులబాంధవుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రెండు ఆలయాల్లో కమిటీ పెద్దల ఆధ్వర్యంలో తొగట వీరక్షత్రియులు జ్యోతులను ఊరేగిస్తూ గ్రామ పుర వీధుల వెంట ర్యాలీగా అమ్మవార్ల దేవాలయాలకు వెళ్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కలశాలు, డప్పు వాయిద్యాల మధ్య దేవాలయాలకు ఊరేగింపుగా వెళ్లారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి

గోనెగండ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. సోదరీ సోదరుల మధ్య అనురాగానికి ప్రతీకగా ఈ పండుగను ప్రతి ఏడాది శ్రావణ మాసం పౌర్ణమి రోజు జరుపుకుంటారు. దేవాలయాలకు వెళ్లి సోదర, సోదరీ, ప్రేమ కల కాలం ఉండాలని ప్రత్యేక పూజలు చేయించి రక్షాబంధన్‌ను కట్టుకున్నారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు. గోనెగండ్ల మేజర్ సర్పంచ్ హైమావతి జర్నలిస్టు సంఘం నాయకుడు కట్టుబడి ఖలీల్ బాష కు రాఖీ కట్టారు.

మహిళ అదృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు. గత నెల 28న తండ్రీ కూతుళ్లు, ఎమ్మిగనూరు శాంతి నర్సింగ్ హోమ్‌కు చికిత్స కోసం వెళ్లారు. తండ్రి మెడికల్ స్టోర్‌కు వెళ్లి మందులు తెచ్చేలోపు సదరు మహిళ కనిపించలేదు. ఆమె కోసం 11రోజులుగా బంధువుల వద్ద, పరిచయస్తుల వద్ద గాలింపు చేపట్టిన ఆచూకీ లభ్యం కాలేదు. శనివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో మహిళ అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు.

ఈవో బదిలీని రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కౌతాళం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఆలయ ఈవో విజయరాజును అకారణంగా రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో చేసిన అక్రమ బదిలీని వెంటనే ఆపకపోతే సీపీఎం ఆధ్వర్యంలో దేవాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని ఆపార్టీ సీనియర్ నాయకుడు మల్లయ అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఏసీగా, డీసీగా విధులు చేపట్టిన వారు 50 సంవత్సరాలుగా చేయని ఆలయ అభివృద్ధి డీసీగా విధులు నిర్వహించిన 10 నెలల్లోపే ఆలయంలో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి పనులు చేసిన ఈవో విజయరాజు ముఖ్యంగా ఆలయంలో శ్రావణ మాసపు ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో ఆలయ ఈవో విజయరాజును బదిలీ చేయడమంటే ఆలయ అభివృద్ధిని అడ్డుకోవడమే అవుతుందన్నారు. ఆలయ ఈవో విజయ రాజు బదిలీని వెంటనే రద్దు చేయకపోతే పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ప్రత్యక్ష పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

'హర్ ఘర్ తిరంగా'ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరు, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): దేశసైనికులు చేస్తున్న పోరాటాలకు, వారి త్యాగాలకు మద్దతుగా నేడు ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే హర్ ఘర్ తిరంగా ర్యాలీలో రాజకీయ పార్టీలకు, కులమతాలకు అతీతంగా, ప్రతీ పౌరుడు జాతీయ పతాకాన్ని చేతభూని కార్యక్రమం జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, బీజేపీ రాష్ట్రకమిటీ ప్రత్యేక ఆహ్వానితులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తం రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటి పిలుపుమేరకు నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా 10నుంచి 14వ తేదీ వరకు ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. మొదట ఎమ్మిగనూరు పట్టణంలో నేడు శివ సర్కిల్ నుంచి వైఎస్ఆర్ సర్కిల్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు జాతీయజెండాతో పాల్గొనాలన్నారు. దేశరక్షణ కోసం మన సైనికులు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా 'దేశప్రజలంత మీ వెంట ఉన్నాం' అని వారికి ఆత్మస్థైర్యం ఇచ్చేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో లలిత్, నరసింహులు, గురురాజదేశాయ్, కౌన్సిలర్ దయాసాగర్, చిన్న ఈరన్న, బీఎన్ ఈరన్న, శవ, జెట్టప్ప, ఉరుకుందు, గౌడ్, బీఎల్ నారాయణ, మాజీ సర్పంచ్ రామన్న గౌడ్ పాల్గొన్నారు.

వర్షం కోసం జలాభిషేకం



గుడికల్లులో నీటి బిందెలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో వరుణుడి కోసం గ్రామంలోని యువకులు, ప్రజలు దేవతా మూర్తులకు జలాభిషేకాన్ని నిర్వహించారు. ఈ ఏడాది వానల సమృద్ధిగా పడి పంటలు పడాలని గ్రామంలో వెలసిన దేవతామూర్తులకు యువకులు మంత్రాలయం తుంగభద్ర జలాన్ని తీసుకొచ్చి జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలో వెలసిన శ్రీనడవలయ్యస్వామి, భ్రమరాంభ మల్లికార్జునస్వామి, వీరభద్రస్వామి, మారెమ్మవ్వ, పెద్దమ్మలతో పాటు మొత్తం 29 మంది దేవతా మూర్తులకు 29 బిందెలతో భారీగా ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద వై. రుద్రగౌడ్, పెద్ద సంఖ్యలో గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

కోసిగయ్యకు తుంగా జలంతో అభిషేకం



కోసిగయ్యస్వామికి తుంగభద్ర జలాలు తీసుకెళ్తున్న భక్తులు

కోసిగి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగిలోని 3వ వార్డులో వెలసిన కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి)కి సుమారు 100 మందికి పైగా భక్తులు తుంగభద్ర నదికి పాదయాత్రగా వెళ్లి ఆలయ అర్చకుడు విష్ణుజిత్తు ఆధ్వర్యంలో తుంగభద్ర నది జలాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఐదు చోట్ల నుంచి జలాలు తీసుకొచ్చి ఆంజనేయస్వామికి భక్తులు జలాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

భావనారాయణస్వామి ప్రభోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరుబజారు ప్రాంతంలో వెలసిన మార్కండేయస్వామి ఆలయంలో శ్రావణశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం ఎమ్మిగనూరు పద్మశాలి బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయస్వామి దేవాలయంలో భద్రావతిదేవి, భావనారయణస్వామి ప్రభోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు గంగాజలాభిషేకం, రుద్రాభిషేకం, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం వంటి పూజలను నిర్వహించారు. అలాగే తులపతాకావిష్కరణను చేశారు. అనంతరం శ్రీభద్రావతిదేవి, భావనారాయణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ అనంతరం ఉయ్యాల సేవ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి బహూత్తమ సంఘం అధ్యక్షులు చుంచాపెద్దరంగస్వామి, కార్యదర్శి పోలెవీరప్రసాద్, కోశాధికారి దోమా భీమేష్, రవికుమార్, పట్టణ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులు విశ్వనాథ్‌రమేష్, కార్యదర్శి క్యాబర్షి సురేష్‌బాబు, కోశాధికారి ఆడిమి ఉరుకుందు, కార్యదర్శి మానా సత్యనారాయణలతో పాటు పద్మశాలి కులబాంధవులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్న గిరిజనులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల ఆరాధ్య దైవం ఏకలవ్యుడి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శివసూర్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులను గుర్తించి మా సంస్కృతుల, సంప్రదాయాలను కాపాడుట శుభపరిణామం, పల్లెల్లో నివసించే గిరిజనులు అంతరించి పోవడంతో తమ సంస్కృతులు, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ప్రభుత్వా లు గిరిజనులకు జీవనోపాధి కల్పించి తమ జాతి ప్రజలను ఆదుకోవాలన్నారు.

రోడ్లపై వర్షపు నీరు



హెచ్‌బీఎస్ కాలనీలో గుంతలు పడ్డ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు రహదారులు, కాలనీలు చిన్నపాటి వర్షానికి జలమయం అయ్యాయి. శుక్రవారం, శనివారం ఓ మోస్తారు వర్షానికే అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎద్దుల మార్కెట్ రోడ్డు గుంతలమయంగా ఉండడం వల్ల వర్షపు నీరు నిలవడంతో గుంతలు కనపడక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. హెచ్‌బీఎస్ కాలనీ, గాయత్రీ దేవి ఆలయం దగ్గర నారాయణ స్కూల్‌కు వెళ్లే దారి చిన్నపాటి వర్షపు నీటికే దారుణంగా మారుతోంది. అలాగే మైనార్టీ కాలనీలో వర్షాలకు నీరు రోడ్లపై నిల్వడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని కాలనీల్లో లక్ష్మీపేట, సంజీవ నగర్‌లలో కల్వర్టులు డ్రైనేజిలు అప్పటి పరిస్థితులకు తగ్గట్లు నిర్మించడం వల్ల ఇప్పటి జనాభా మరియు రోడ్లు ఎత్తుగా నిర్మించడంతో వర్ష కాలంలో మురుగు నీరు కల్వర్టులపై నుండి నీరు వస్తుండడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, కల్వర్టులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి

నందవరం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నందవరంలోని సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హామీ ఇచ్చారని టీడీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు దేశాయి మాధవరావు అన్నారు. శనివారం అయన కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కార్యకర్తకు, అర్హులైన ప్రజలందరికి ఇంటి పట్టాలు, సంక్షేమ పథకాలు అందించాలని ఎమ్మెల్యే చెప్పారని ప్రతి ఒక్కరు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమస్యలన్నీ పరిష్కరించేందుకు త్వరలో ఎమ్మెల్యే వస్తారని అప్పటిలోపు అర్హులైన ప్రతి ఒక్కరు పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా ఇంటి పట్టాలు ఇచ్చి , ఇల్లు నిర్మించి ఇస్తారన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డులకు కూడా సచివాలయంలో దరాఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బెస్త ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, మల్లి, పంపయ్య, నరసింహులు పాల్గొన్నారు.

జాగ్రత్త వహించాలి



వాహనదారులతో మాట్లాడుతున్న గ్రామీణ ఎస్ఐ

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని కలుగొట్ల రోడ్డులో వాహనదారులతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపే సమయంలో నిర్ణీత వేగంతోనే ప్రయాణం చేయాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండ హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడింగ్ చేయకూడదన్నారు. రోడ్డు ప్రమాదంలో జరగరానిదేదైనా జరిగి ప్రాణాలు కోల్పోతే మొత్తం కుటుంబమే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆటోలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు.